క్లుప్తంగా

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు


రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

హాలహర్వి: రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి, లైసెన్స్‌ను రద్దు చేస్తామని డివిజన్ స్క్వాడ్, ఎమ్మిగనూరు ఏడీఏ ఖాద్రి, ఎమ్మిగనూరు ఏఓ అనిల్, హాలహర్వి ఏఓ శివశంకర్ ఫర్టిలైజర్స్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గూళ్యం, హాలహర్వి, చింతకుంట గ్రామాల్లోని వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, కిసాన్‌మాల్‌లను తనిఖీ చేశారు. షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్, ఫామ్–సీ తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కచ్చితంగా రశీదులు ఇవ్వాలన్నారు.

సక్రమంగా నీటిని సరఫరా చేయాలి


పైపులైను పనులు పరిశీలిస్తున్న దృశ్యం

మద్దికెర: నీటిని సక్రమంగా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాయంక్, సర్పంచ్ విజయుడు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి సంబంధించి పైపులు పగిలిపోవడంతో వాటికి మరమ్మతులు చేయించారు.

ఖాతాలో నిధులు జమ చేయాలి


ఈఓపీఆర్‌డీకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ: ఏటా మహిళలకు ఇచ్చే చేయూత నిధులు ఖాతాలక జమ చేయాలని మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఎంపీటీసీ మాజీ సభ్యులు ఎం.నరసారావు, సీపీఐ నాయకులు కందప్ప, అశ్వద్ధామ, భాస్కర్, మధు మద్దతు తెలిపారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిప్రతాన్ని ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణకు అందించారు.

డెంగీ నివారణపై అవగాహన


పోస్టర్ విడుదల చేస్తున్న మెడికల్ ఆఫీసర్ షేక్ అఫ్రోజ్ జాన్

చిప్పగిరి: డెంగీ వ్యాధి నివారణ చర్యలపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ షేక్ అఫ్రోజ్‌జాన్ మంగళవారం ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ వేడి ఆహార పదార్థాలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమ తెరలు వాడటం, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవటం వంటి వాటిపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో వెల్దుర్తి విద్యార్థి ప్రతిభ


సిల్వర్ మెడల్ సాధించిన వై మహేశ్

వెల్దుర్తి(కృష్ణగిరి): తమిళనాడు రాష్ట్రం చెన్నై నెహ్రూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగిన సౌత్ జోన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో వెల్దుర్తికి చెందిన వై మహేశ్ ప్రతిభ చూపాడు. 80–86 కేజీల యూత్ కేటగిరీలో జరిగిన బాక్సింగ్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించినట్లు మంగళవారం ఏబీ బాక్సింగ్ అకాడమీ కోచ్ ఫయాజ్ తెలిపారు.

గోశాలలకు తరలిస్తాం

డోన్ : పట్టణ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఎట్టిపశువులను గోశాలలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కొందరు పశువుల యజమానులు వేకువజామున వీధుల్లోకి వదులుతుండటంతో వాహనదారులు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయన్నారు. ఈ విషయంపై పలుమార్లు పశువుల యజమానులకు సమాచారం అందించినా స్పందించలేదని, ఎట్టి పశువులను బందెల దొడ్డికి తరలిస్తామని ఆయన హెచ్చరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

● వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. మంగళవారం మండలంలోని క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు, తనను ఎంతో ఆదరించి గెలిపించారన్నారు. అందులో హాలహర్వి మండలం మంచి మెజార్టీ వచ్చిందన్నారు. తనను నమ్మి ఓటేసి గెలిపించి వారిని వదిలి వేరే పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. త్వరలో గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటానన్నారు. ఇటీవల టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీకి తనను పిలవకపోవడం తగదన్నారు. అనంతరం ఆయన జె.హొసళ్లి గ్రామంలో పర్యటించారు. శంబులింగస్వామి మఠంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ నెట్టికంటమ్మ, వైస్ ఎంపీపీ నాగేష్, పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, కో–కన్వీనర్ మల్లికార్జున, నాయకులు గంగాధర, తిప్పారెడ్డి, మారయ్య, లోకనాథ్, శ్రీనివాసులు, యల్లప్ప, ఎస్కేగిరి, కుమారస్వామి, పరశురామ్, గోపాల్, ఎంపీటీసీలు రామకృష్ణ, గోపాల్, మల్లికార్జున, సర్పంచులు ఉలిగప్ప, మల్లి, ఓబుళపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం దారుణం

ఆలూరు: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం విరూపాక్షి విలేకరులతో మాట్లాడారు. ప్రజాసంక్షేమ కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో ప్రభుత్వ భవనాలను రూ.కోట్లు వెచ్చించి నిర్మించిందన్నారు. వాటిని కూలగొట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఏ పార్టీ గెలిచినా పంథాలు, పట్టింపులకు వెళ్లకుండా అభివృద్ధి చేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నారు.

ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులు


రాంభూపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మద్దికెర: భావితరాలకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులని ఎంఈఓలు రంగస్వామి, గోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హంప గ్రామంలో పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయుడు రాంభూపాల్‌ను సన్మానించారు. వారు మాట్లాడుతూ శేషజీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, శీనప్ప, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.


పగిడిరాయి పీహెచ్‌సీలో శాంతమ్మను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌ఎన్ ఎం.శాంతమ్మ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీలో ఆమెను వైద్యులు హరిత, మినాజ్ పాషా, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆప్తాలిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్ వైజర్లు బండయ్య, గోవిందరాజు, కాంతమ్మ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళహారతి ఇచ్చారు. స్వామి వారిని జాతీయ వినియోగదారుల హక్కుల ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ రవిశంకర్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ స్వామి వారి జ్ఞాపికను ఆయనకు అందజేశారు.

నేడు కార్యకర్తల సమావేశం

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీల సమావేశం ఉంటుందని ఆ పార్టీ మండల కన్వీనర్ పెద్దయ్య మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి హాజరువుతున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

విజయేంద్రతీర్థులకు ఏకాదశి పూజలు

హొళగుంద: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన విజయేంద్ర తీర్థుల ఆరాధన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం నిర్మల్య విసర్జన, మంగళహారతి, సాయంత్రం ప్రవచన, భజన కార్యక్రమంతో పాటు ఇతర పూజా కార్యక్రమాలను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణులు నిర్వహించారు.

టెండర్ దక్కించుకున్న వారే షాపులు నిర్వహించాలి


ఎస్‌ఐ ఓబులేషుకు రాతపూర్వక పత్రాన్ని అందిస్తున్న జనార్ధన్ శెట్టి

ఆలూరు రూరల్: స్థానిక ఎల్లార్తి రోడ్డులోని స్పోర్ట్స్ అథారిటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న షాపులను టెండర్‌లో దక్కించుకున్న వారు మాత్రమే నిర్వహించుకోవాలని ఆలూరు ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్ ధనుంజయ సూచించారు. ఆలూరుకు చెందిన జనార్ధన్ శెట్టి స్పోర్ట్స్ అథారిటీ కాంప్లెక్స్‌లోని షాపు నంబర్ 6ను టెండరు ద్వారా దక్కించుకున్నాడు. అయితే ఆ షాపును ఇటీవల వేరేవారికి బాడుగకు ఇచ్చేందుకు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఈ విషయమై జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు ఫిర్యాదు అందిండంతో విచారణ చేపట్టారు. మంగళవారం ఇండోర్ స్టేడియం కమిటీ మెంబర్ ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఓబులేషు సమక్షంలో జనార్ధన్ శెట్టి ద్వారా షాపు ఇతరులకు ఇవ్వనని, తానే నిర్వహించుకుంటానని రాతపూర్వక హామీని తీసుకున్నారు. అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని లేని యెడలా టెండర్‌ను రద్దు చేసి మరోసారి వేలం వేస్తామని మిగతా 5 షాపుల నిర్వాహకులను వారు హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీలో వివాదం


● రెండు వర్గాలపై కేసు నమోదు

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో పింఛన్ల పంపిణీలో వివాదానికి దిగిన రెండు వర్గాలపై మంగళవారం కేసు నమోదైంది. గ్రామంలో ఒక వర్గానికి చెందిన టీడీపీ నాయకులు అయ్యాళప్ప మరికొందరు సోమవారం ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో అక్కడికెళ్లిన అదే పార్టీకి చెందిన మరో నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తన అనుచరులతో కలిసి తమకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించాడు. పార్టీకి దూరంగా ఉండేవారిని, ఇతర పార్టీలోకి వెళ్లేవారు తమను ఎలా ప్రశ్నిస్తారని అయ్యాళప్ప వర్గం వారు అనడంతో కొద్ది సేపు వాగ్వావాదం చోటుచేసుకుంది. ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలకు సర్దిచెప్పడంతో సమస్య అప్పటికి సద్దుమణిగింది. కాగా మంగళవారం హెబ్బటం బస్టాండులో ఇరువర్గాలకు చెందిన వారు మరోసారి వాగ్వాదానికి దిగి ఒకరికొకరు తోసుకుని కొట్టుకున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరు వర్గాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హొళగుంద: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణంలో సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో పలువురు సభ్యులు సమస్యలను లేవనెత్తారు. పంచాయతీకి వచ్చే నిధులను వృథా చేయకుండా అభివృద్ధి పనులకు వినియోగించాలని వార్డు సభ్యుడు చిన్న మల్లయ్య సభ దృష్టికి తెచ్చారు. కలుషిత నీరు సరఫర కాకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు చిదానంద కోరారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ పంచాయతీ నిధులను సీసీ రోడ్లు, డ్రైన్లు, పైప్‌లైన నిర్మాణాలకు ఖర్చు చేశామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సంఘాల నాయకులు

మద్దికెర: నీట్ పరీక్షల అక్రమాలకు నిరసనగా ఈనెల 4న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఆయా సంఘాల నాయకులు రవికుమార్, శ్రీకాంత్, రంగస్వామి కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైద్యవిద్యాకోర్సులు చదవాలనుకునే 24 లక్షల మంది విద్యార్థులకు మే 24న పరీక్షలు సక్రమంగా నిర్వహించకపోగా అక్రమాలకు పాల్పడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని, పూర్తి స్థాయి విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

ఆస్పరి: ఈనెల 4న నీట్ పరీక్షల అక్రమాలకు నిరసనగా చేపట్టనున్న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రమేష్, రవి, ఈశ్వర్ కోరారు. మంగళవారం వారు ఆస్పరిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు రాజు, వీరేష్, రంగస్వామి, శ్రీకాంత్, ధనుంజయ, సుధాకర్ పాల్గొన్నారు.

హొళగుంద: నీట్ అక్రమాలకు నిరసనగా ఈ నెల 4న చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల కార్యదర్శి సతీష్‌కుమార్ కోరారు.

దేవనకొండ: నీట్ పేపర్ లీకేజీ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవితేజ, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శులు భాస్కర్, మధు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇదే ఘటనపై ఈనెల 4న చేపట్టనున్న బంద్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు, నాయకులు చిన్న, వీరేందర్, నాయుడు, విష్ణువర్ధన మల్లికార్జున, రాజు, నాని, పులిరాజు, అశోక్, అచ్యుత్ పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై సరైన న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ ఈనెల 4న దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను మండలంలో విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శ్యామ్ కోరారు. మంగళవారం ఆయన సమితి ప్రతినిధులు సుదర్శన్, అన్వర్‌బాషాతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

అత్యాచారం కేసు నమోదు

డోన్ టౌన్ : ప్రేమ పేరుతో బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి నిందితునిపై అత్యాచారం, ఫోక్స్, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొండపేటకు చెందిన యువకుడు నాసీర్ (19) చిగురమానుపేటకు చెందిన ఒక మైనర్ బాలికను రెండేళ్లుగా ప్రేమిస్తున్నట్లు నమ్మించాడు. ఈనెల 1వ తేదీ బాలికలను తీసుకెళ్లి లైంగికవాంఛ తీర్చుకుని మంగళవారం ఇంటి వద్ద వదిలేసి వెళ్లాడు. ఈ విషయంపై బాధితురాలి తల్లి గట్టిగా నిదీయగా బాలిక అసలు విషయం చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించింది.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

పత్తికొండ రూరల్: బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. మంగళవారం పత్తికొండలోని శారద వృద్ధాశ్రమంలో ఏర్పాటుచేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో బీజేపీకి బలమైన పునాదులు పడ్డాయన్నారు. పార్టీ నాయకత్వం సమర్థవంతంగా పనిచేసి మరింత నిర్మాణాత్మకమైన కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండి మల్లికార్జున, కిసాన్ మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జ్ సీసీ రంగన్న, అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్, పత్తికొండ మండల అధ్యక్షుడు శంకరయ్య, లీగల్‌సెల్ కన్వీనర్ భాస్కర్, నరేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు నుంచి పడి వృద్ధుడికి గాయాలు

ఆదోని అర్బన్: పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఇబ్రహీం (60) బస్సు పుట్‌బోర్డు నుంచి కింద పడి గాయాలపాలయ్యాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఇబ్రహీం పని నిమిత్తం ఆదోనికి బయలుదేరాడు. గ్రామంలో బస్సు ఎక్కి సీట్లు ఖాళీ లేకపోవడంతో మెట్లపై కూర్చున్నాడు. బస్సు వెళ్తుండగా అలసటతో కునుకు తీశాడు. కుప్పగల్ గ్రామ సమీపాన రోడ్డుపై పశువులు అడ్డు రావడంతో బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో పుట్‌బోర్డుపై నిద్రమత్తులో ఉన్న ఇబ్రహీం పట్టుజారి బస్సు నుంచి కింద పడ్డాడు. గాయాలపాలైన ఇబ్రహీంను బస్సు డ్రైవర్ మహమ్మద్‌ఖాన్, కండక్టర్ గణపతి చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ రూరల్: ప్రజాసమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రధానంగా పంట కాలువలకు నీరు అందించి రైతులకు సాగునీటి అవసరాలు తీరుస్తామన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి తగిన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. చెరువులు నింపే ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. బీసీ బాలికల వసతి గృహంలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. తాను ఎమ్మెల్యేకు సన్నిహితుడినని, బంధువునని చెప్పి పింఛన్, డీలర్‌షిప్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ తదితర వాటిని ఇప్పిస్తామని పార్టీ నాయకులు గానీ, కార్యకర్తలు గానీ డబ్బు వసూలు చేసినట్లు తెలిస్తే సహించేది లేదన్నారు. ఇలాంటివి తన దృష్టికి వస్తే పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేసేందుకు కూడా వెనుకాడేది లేదన్నారు. అనంతరం 'ఎమ్మెల్యేకు చెబుదాం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన దృష్టికి తీసుకురావాల్సిన అంశాన్ని ఈ పుస్తకంలో రాసి తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, నాయకులు పురుషోత్తంచౌదరి, అట్లా ప్రమోద్‌కుమార్‌రెడ్డి, తిమ్మయ్యచౌదరి, మనోహర్‌చౌదరి, కడవల సుధాకర్, తిరుపాల్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి


వేలంపాట నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

ఆలూరు రూరల్: మేజర్ పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ అరుణాదేవి సూచించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణంలో పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ మార్కెట్ వేలాలు నిర్వహించారు. వారపు సంత రూ.2,11,000 నాగరాజు, ఓబులేష్ దక్కించుకున్నారు. దినసరి కూరగాయల మార్కెట్ రూ.2,63,000 వెంకటలక్ష్మి దక్కించుకున్నారు. బస్టాండ్ వేలం పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు రాంబాబు, వినోద్, బిల్ కలెక్టర్ వరుణ్, సీఈఓ జిలాన్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

దేవనకొండ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం ఆమె స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం ఆమె స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశమై మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియావ్యాధుల గురించి ప్రజలకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఆశావర్కర్లు విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, వైద్యులు విజయ్‌కుమార్, కళ్యాణ్, సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, రంగస్వామి, జయలక్ష్మి, హనుమంతమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


ఎంపీడీఓ ఆంథోనీ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

పదవీవిరమణ తప్పనిసరి

● జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.నాసరెడ్డి

హాలహర్వి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి అని, పని చేసినన్ని రోజులు ప్రజల ఆదరాభిమానాలు పొందాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.నాసరెడ్డి అన్నారు. ఎంపీడీఓ ఆంథోనీ మంగళవారం పదవీ విరమణ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని ఆంథోనీ సేవలను కొనియాడారు. శేషజీవితం బాగుండాలని ఆకాంక్షించారు. అనంతరం జెడ్పీ సీఈఓతో పాటు అధికారులు, కార్యాలయ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆంథోనీ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెట్టికంటమ్మ, జెడ్పీటీసీ లింగప్ప, వైస్ ఎంపీపీ నగేష్ నాయుడు, తహసీల్దార్ బ్యాల, ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సీతాలదేవి వేడుక


పూజలందుకుంటున్న సీతాలదేవి

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి తండాలో వెలిసిన సీతాలదేవి (సుంకలమ్మ) వేడుకను మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు నైవేద్యాన్ని గ్రామం నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.


నైవేద్యం సమర్పించేందుకు ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, చిన్నారులు

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కౌతాళం: వెల్దుర్తి మండలం రత్నపల్లెలో దళిత మహిళ హనుమక్కపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తాయప్ప, మారయ్య మాట్లాడుతూ దళిత మహిళ హనుమక్క గత 30 సంవత్సరాల నుంచి సాగుచేసుకుంటున్న భూమిపై ఆధిపత్య వర్గాల కన్నుపడిందన్నారు. ఆమె సాగుచేసిన పంటను ధ్వంసం చేసేందుకు పూనుకున్నారని అడ్డుకొబోయిన హనుమక్కను కొట్టి గాయపరిచారని తెలిపారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదుచేయకుండా హనుమక్కను భయభ్రాంతులకు గురి చేయడం పోలీసులకు సరికాదన్నారు. నిందితులను అరెస్టు చేయకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో దావీద్, వీరప్ప, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ

● రేపు 121వ జయంతి


బీవీ సుబ్బారెడ్డి(ఫైల్)


కోవెలకుంట్లలో బీవీ సుబ్బారెడ్డి మెమోరియల్ పార్క్

కోవెలకుంట్ల: దివంగత బీవీ సుబ్బారెడ్డి పేరు చెప్పగానే రేనాటి గడ్డగా పిలువ బడుతున్న కోవెలకుంట్ల ప్రాంతం గుర్తుకొస్తుంది. ఉపముఖ్యమంత్రి, స్పీకర్ పదవులకు వన్నె తెచ్చిన పట్టణానికి చెందిన దివంగత బీవీ సుబ్బారెడ్డి 121 జయంతిని గురువారం నిర్వహించేందుకు ఆయన వంశస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1952లో నియోజకవర్గం ఏర్పడి మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. 1955లో పట్టణానికి చెందిన బీవీ సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పెండేకంటి వెంకటసుబ్బయ్యపై విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్‌పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఇండిపెండెంట్ అభ్యర్థి కొర్రపాటి రామిరెడ్డిపై గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. బీవీ హయాంలో అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు రోడ్లు, విద్యుత్ సౌకర్యం పొందారు. కోవెలకుంట్ల నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే గెలుపొందడమే కాక రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పనిచేశారు. బీవీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, పది సంవత్సరాలపాటు శాసనసభ స్పీకర్‌గా పనిచేసి రేనాటిఖ్యాతిని నలువైపులా వ్యాపింప చేశారు.